క్లుప్తంగా

ఈనెల 28, 29న బాలాలయం పూజలు



పూజలు అందుకుంటున్న సంజీవరాయస్వామి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో ఈ నెల 28, 29న బాలాలయం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసయ్య తెలిపారు. శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్వామివారి మూల విగ్రహ దర్శనం ఉండదని, అయితే ప్రతి రోజు స్వామికి చేసే పూజలు, అభిషేకాలు యథాప్రకారం ఉత్సవ మూర్తులకు జరుగుతాయని వివరించారు. భక్తులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఈఓ తెలిపారు.

నేడు జొన్నల కొనుగోలు ప్రారంభం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం నుంచి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీ కుమారి ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నేడు సోమాపురంలో ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని సోమాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్‌ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేయనున్నట్లు వైద్యాధికారి తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : 2024 ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పంచాయతీరాజ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పుల్లివీడు పంచాయతీ నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ముఖ్యమంత్రి 175 సీట్లు గెలుచుకోవాలనే ధ్యేయంతో కృషి చేస్తున్నారని, ఆయన అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రజల్లోకి పదే పదే తీసుకపోవాలన్నారు. బద్వేలు నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించాలంటే అందరి సమష్టి కృషి అవసరమన్నారు.


బాడీ ఫ్రీజర్‌ బాక్స్‌ వితరణ



బాడీ ఫ్రీజర్‌ బాక్స్‌ అందిస్తున్న తొగటవీరక్షత్రియ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని పద్మశాలీయ హిందూ స్మృతి వనంకు తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్‌ బాక్స్‌ ఆదివారం వితరణగా అందించారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఏపీఎస్పీడీసీఎల్‌ రిటైర్డు ఫోర్‌మెన్‌ పల్లా వెంకట శేషయ్య తన భార్య పల్లా రామలక్షుమ్మ, కుమారుడు పల్లా రత్నయ్యల జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్‌ బాక్స్‌ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్మృతివనం కమిటీ అధ్యక్షుడు డాక్టర్‌ సోమా లక్ష్మీనరసయ్య, తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ఈడెం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు బొలిశెట్టి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పల్లా వీరభద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధాశక్తి వెలికితీయాలి



రాత పరీక్షను పరిశీలిస్తున్న అసిస్టెంట్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ విజయ్‌ భాస్కర్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికి తీయాలని కడప డివిజన్‌ అసిస్టెంట్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ అంచెల విజయ్‌భాస్కర్‌ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పోస్టల్‌ ప్రధాన కార్యాలయంలో లేఖ విశేషాల గురించి విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు.

15 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

- 18న సిద్ధం సభకు తరలి రండి
- టీడీపీ నేతలు టికెట్‌ కోసం ఎవరి ఫర్‌ఫార్మెన్స్‌ వారిదే
- పార్టీ కార్యకర్తల సదస్సులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రొద్దుటూరు : ఈ నెల 15 నుంచి ప్రొద్దుటూరులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని రాచమల్లు మైదానంలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సదస్సు ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 15న ఉదయం 8 గంటలకు రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని సాగిస్తామన్నారు. తొలి రోజు ప్రచారానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు. మనం రావణాసురుడితో తలపడుతున్నామని, రామదండు లాంటి జగనన్న సైన్యం మనకు అండగా ఉందన్నారు. 60 రోజుల పాటు విశ్రాంతి లేకుండా పార్టీ కోసం అందరూ శ్రమించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా తాను, ఎంపీ అభ్యర్థిగా వైఎస్‌ అవినాష్‌రెడ్డి మరో మారు పోటీ చేస్తున్నామన్నారు. ఇవి అబద్ధానికి, నిజానికి జరిగే ఎన్నికలని స్పష్టం చేశారు. ధర్మాన్ని, న్యాయాన్ని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చంద్రబాబు మరో మారు అబద్ధాలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. స్థానిక టీడీపీ నేతలు టికెట్‌ కోసం ఎవరి ఫర్‌ఫార్మెన్స్‌ వారు చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆపద సమయంలో ఎలాంటి సాయం కూడా వారు చేయలేదన్నారు. నాలుగేళ్ల ఆరు నెలలు పూర్తయిన తర్వాత తాము ఉన్నామని ఓట్ల కోసం వస్తున్నారన్నారు. వీరందరి కంటే అన్న క్యాంటిన్‌ నిర్వహిస్తున్న సురేష్‌నాయుడు కొంత బెటర్‌ అని, కనీసం పేదల కడుపు నింపుతున్నారన్నారు. టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌ కనీసం భిక్షం కూడా పెట్టలేదని తెలిపారు. గతంలో ప్రొద్దుటూరుకు గ్రహణం పట్టి వీడిపోయిందని, మళ్లీ గ్రహణం పడుతోందని మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. తన హయాంలో అభివృద్ధి గురించి పట్టించుకోని వరద 86 ఏళ్ల వయసులో టికెట్‌ కోసం వెంపర్లాడుతున్నారన్నారు. ఆయన పాతికేళ్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారని, ఆ సమయంలో ప్రజలకు ఒరిగింది శూన్యమని తెలిపారు. తన హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం కోసం విరివిగా నిధులు మంజూరు చేయించానన్నారు. పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, కూరగాయల మార్కెట్‌, బస్టాండ్‌, వైఎస్సార్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ అభివృద్ధి, పైపులైన్‌ నిర్మాణాలు, మురికి నీటి కాలువల ఆధునికీకరణ పనులను చేపడుతున్నామన్నారు. సీఎం జగనన్న సచివాలయాలు, గ్రంథాలయాలు, డాక్టర వైఎస్సార్‌ విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లు, రైతులకు రైతు భరోసా కేంద్రాలు నిర్మించామన్నారు. జగనన్న అమ్మ ఒడి, మన బడి–నాడు పథకాలతో విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. జరిగిన అభివృద్ధి గురించి మనం కలిసికట్టుగా ప్రచారం చేస్తే లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తామని తెలిపారు. తాను ఒకటో వార్డు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని, తన సతీమణి రాచమల్లు రమాదేవి 41వ వార్డు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు. అలాగే తన సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డి రాజుపాళెం మండలంలో ప్రచారం చేస్తారన్నారు. పులివెందుల తర్వాత పార్టీకి తొలి విజయం మనమే అందించాలని కార్యకర్తలను కోరారు. టీడీపీ నేతలు పేదలపై పెత్తనం చేశారని, మనం సేవ చేశామన్నారు. ఈ ఊరి ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అవసరమైన సాయం చేస్తానన్నారు. రాక్షసుల్లాంటి టీడీపీ నేతలతో మనం పోటీ పడుతున్నామన్నారు.

18న సిద్ధం సభకు తరలి రండి

ఈనెల 18న అనంతపురంలో జరిగే సిద్ధం సభకు కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఇందుకోసం 300 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యే ఈ సభను జయప్రదం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్‌ యాదవ్‌, ఆప్కాబ్‌ చైర్‌పర్సన్‌ మల్లెల ఝాన్సీరాణి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్లు ఆయిల్‌ మిల్లు ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ జేష్టాది శారద, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, ఇన్‌చార్జి ఎంపీపీ ఏఎస్‌ నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల కన్వీనర్‌ గుద్దేటి రాజారాంరెడ్డి, వెలవలి రాజశేఖరెడ్డి, వైఎస్సార్‌సీపీ పద్మశాలీయ విభాగం జిల్లా అధ్యక్షురాలు మద్దూరి దేవి, జేసీఎస్‌ జిల్లా కోఆర్డినేటర్‌ కల్లూరు నాగేంద్రారెడ్డి, మండల కన్వీనర్‌ ఓబయ్య యాదవ్‌, కౌన్సిలర్‌ పిట్టా బాలాజీ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ప్రొద్దుటూరు కోఆపరేటివ్‌ స్టోర్స్‌ అధ్యక్షురాలు గజ్జల కళావతి, పీసీసీ మెంబర్‌ కాకర్ల నాగేశ్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పోరుమామిళ్ల : మండలంలోని కాలువకట్ట తిరుమలగిరిపై వెలసిన శ్రీ లక్ష్మీదేవి, గోదాదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన దశమ వార్షికోత్సవం ఈనెల 15 నుండి 19 వరకు వైభవంగా జరుగుతుందని ఆలయ ధర్మకర్త తిరిపేలయ్య, ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. 15వ తేదీ విష్వక్సేనపూజ, అంకురారోపణము, కొర్రపాటి పల్లె, కట్టకిందిపల్లెల్లో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 16వ తేదీ స్వామికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పంచామృతాభిషేకం, అలంకరణ, చింతలపల్లెలో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 17వ తేదీ ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, విశేష మహాశాంతి హోమం, 18వ తేదీ ఆదివారం స్వామివారి శాంతికల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. 19వ తేదీ సుదర్శన చక్రస్వామికి అభిషేకం, కోనేరులో చక్రస్నానం ఉంటుందన్నారు. భక్తులు సాంప్రదాయ దుస్తులతో రావాలన్నారు.

నేటి నుంచి నూతన విగ్రహ ప్రతిష్ట

గోపవరం : మండలంలోని చెన్నవరం గ్రామంలో శ్రీసీతారాముల స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 14వ తేదీ బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట, అదే రోజు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందవలసిందిగా కోరారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : మండలంలోని గోపులాపురం గ్రామంలో సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అడిగిన వెంటనే సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ గ్రామంలో వందేళ్ల క్రితం నిర్మించిన సీతారాముల గుడి శిథిలావస్థకు చేరిందని, ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి చేశారన్నారు. టీటీడీ, దేవదాయశాఖ నుండి రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. దేవాలయాభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎర్రబల్లె ఉపసర్పంచ్‌ మిద్దె రసూల్‌ గౌస్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలె ఈశ్వర్‌రెడ్డి, మూలె ప్రతాప్‌రెడ్డి, యనమల రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రూ.2.30 కోట్లతో నక్కలదిన్నెలో పీహెచ్‌సీ



నక్కలదిన్నెలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చాపాడు: ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీల ఏర్పాటు నేపథ్యంలో.. మండలంలోని నక్కలదిన్నె గ్రామం వద్ద రూ.2.30 కోట్ల నాడు–నేడు నిధులతో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. 1.12 ఎకరాల్లో మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సహకారంతో పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయింది. త్వరలోనే దీనిని ప్రారంభించనున్నట్లు ఆర్‌ అండ్‌ బీ ఏఈ దాదా బాషా తెలిపారు. దీని నిర్మాణం కోసం ఎమ్మెల్యే రఘురామిడ్డి సమీప బంధువు, నక్కలదిన్నె గ్రామానికి చెందిన పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్‌ కలెక్టర్‌గా పని చేస్తున్న శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి స్థలాన్ని ఇచ్చారు. ఇప్పటికే పీహెచ్‌సీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పీహెచ్‌సీలో పర్నీచర్‌, వైద్య పరికరాలు, మందులు వంటి వాటిని తీసుకురావాల్సి ఉంది. ఈ పీహెచ్‌సీ అందుబాటులో వస్తే ఈ ప్రాంత ప్రజలందరికీ సకాలంలో ప్రభుత్వ వైద్య సేవలు అందనున్నాయి. ఎమ్మెల్యే సహకారంతో అనతి కాలంలోనే దీనిని నిర్మాణం పూర్తి చేసినట్లు ఆర్‌ అండ్‌ బీ ఏఈ తెలిపారు.

24 గ్రామాల ప్రజలకు ఉపయోగం

మండలంలో రెండో పీహెచ్‌సీ నక్కలదిన్నె గ్రామంలో నిర్మించటం పట్ల దీని పరిధిలోని 7 గ్రామ సచివాలయాలు, 24 గ్రామాల ప్రజలకు సకాలంలో ప్రభుత్వ వైద్య సేవలు అందనున్నాయి. నక్కలదిన్నె పరిధిలో ఓబాయపల్లె, అనంతపురం, తిప్పిరెడ్డిపల్లె, వెదురూరు పరిధిలో రాజుపాళెం, నరహరిపురం, అయ్యవారిపల్లె పరిధిలో రాజువారిపేట, కొత్తరాజువారిపేట, తిమ్మాయపల్లె, రామదాసుపురం, చిన్నగురువళూరు పరిధిలో కుచ్చుపాప, గాంధీనగర్‌, శ్రీనివాసపురం, పెద్దగురువళూరు పరిధిలో శ్రీరాములపేట, ఓబుళరెడ్డిపేట, అల్లాడుపల్లెలో విజయనగరం, అల్లాడుపల్లె దేవళాలు, లక్ష్మీపేటలో కేతవరం, వీరభద్రాపురం గ్రామాలు నక్కలదిన్న పీహెచ్‌సీ పరిధిలోకి రానున్నాయి. ఈ మేరకూ 5 ఆరోగ్య ఉప కేంద్రాలను దీనిలో విలీనం చేయనున్నారు.

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎల్‌.నాగసుబ్బారెడ్డి

మైదుకూరు : ఈనెల 16న నిర్వహించే గ్రామీణ బంద్‌, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌.నాగసుబ్బారెడ్డి కోరారు. మైదుకూరులో ఆదివారం సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్‌ అధ్యక్షతన వామపక్ష, రైతు సంఘాల నాయకులతో జరిగిన రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు, రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించడం శోచనీయమన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కాలరాసిందన్నారు. దేశ ప్రజలందరి సంపద అయిన ఎల్‌ఐసీ, రైల్వే, పౌర విమానయానం, బ్యాంకులు, గనులు, అటవీ సంపదలను ప్రైవేటు, కార్పొరేట్‌ వర్గాలకు కట్టబెడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలందరికి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌, పారిశ్రామిక సమ్మెలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, యువజనులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరాం, సీఐటీయూ నాయకులు ఎస్‌.షరీఫ్‌, చెన్నమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బీవీ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిలుంగారి పెద్ద పుల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు పీరయ్య, గోశెట్టి రామ్మూర్తి, ఏఐఎస్‌ఎఫ నాయకులు చేతన్‌, బీవీ బాలాజీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక స్కాలర్స్‌ హైస్కూల్‌ ఆవరణలో ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 21 టీంలు పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో అందరిని అలరించారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో జీవన జ్యోతి విద్యాసంస్థల విద్యార్థులు ప్రథమ స్థానంలో, కడప హైస్కూల్‌ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులు నిత్యం క్రీడా సాధన చేసి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ వరుణ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్లు బాలసుబ్బారెడ్డి, అమరనాథరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణాలయ కమిటీ చైర్మన్‌ చల్లా రాజగోపాల్‌ యాదవ్‌, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, చవ్వా శ్రీనివాసులరెడ్డి, ఏఎం రాజా, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



బి.కోడూరు : శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ తెలిపారు. ఆదివారం మండలంలోని డి.ఎస్‌.రెడ్డి స్కూల్‌ ఆవరణలో బూత్‌ అధ్యక్షులు, కో కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లకు మేం సిద్ధం – మా బూత్‌ సిద్ధం అనే కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు ప్రతిఒక్కరికి అందాయన్నారు. ఈ విషయాన్ని ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లినప్పుడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏమి లబ్ధి జరిగింది. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ హయాంలో జరిగిన లబ్ధిని వివరంగా విశదీకరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సహకరించాలని కోరాలని తెలిపారు. లబ్ధిదారులే జగన్‌మోహన్‌రెడ్డికి నిజమైన స్టార్‌కాంపైనర్లు అని వివరించాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్‌ మండల కన్వీనర్‌ హనుమంతరెడ్డి, మార్కెట్‌ మాజీ వైస్‌చైర్మన్‌ రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, జగన్‌ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్‌ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : బి.కోడూరులో ఏర్పాటు చేసిన బూత్‌ కన్వీనర్లు, కో కన్వీనర్ల, కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలు పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు ఏకమై ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేజిక్కుపోవాలని టీడీపీ, జనసేన, కాంగ్రెస్‌, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలు కుమ్మక్కై ప్రజలను మభ్యపెడతారని, వాటన్నింటిని ఎదుర్కొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల పక్షాన ఉందని ప్రజలకు తెలియజేయాలన్నారు. బి.కోడూరు మండలాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యోగానందరెడ్డి, అట్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు మునిరెడ్డి, జయరామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, కేశవరెడ్డి, పిచ్చిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సిద్దేశ్వర్‌ రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, రామిరెడ్డి, చంద్ర, బూత్‌ కన్వీనర్లు, కో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు గ్రామానికి చెందిన కత్తెరపల్లె వెంకటరామిరెడ్డికి గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేసుకుని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలు సీఎం సహాయనిధి కింద రూ.1.50 లక్షల చెక్కును మంజూరు చేయించి ఆదివారం బి.కోడూరులో వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు.

గానబ్రహ్మ ఘంటసాల

బద్వేలు అర్బన్‌ : గానబ్రహ్మ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర్‌రావు అని ఘంటసాల లలిత కళాపరిషత్‌ అధ్యక్షుడు, గాయకుడు ఎస్‌.ఎస్‌.దావూద్‌ తెలిపారు. ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లోని పద్మశ్రీ ఘంటసాల లలిత కళాపరిషత్‌ సంగీత విద్యాలయంలో అమరగాయకుడు ఘంటసాల 50వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ఆయన ప్రతిభ అనితరసాధ్యమైనదని, చిరస్మరణీయమైనదని కొనియాడారు. అనంతరం విద్యార్థులతో ఘంటసాల పాటలు పాడి ఘంటసాల ఆరాధనను విజయవంతం చేశారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఘంటసాల లలిత కళాపరిషత్‌ కోశాధికారి ఉమామహేశ్వరరావు, సీనియర్‌ పాత్రికేయులు గానుగపెంట నరసింహులు, కళాపరిషత్‌ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్రామాల్లో బీజేపీ 'పల్లెకుపోదాం'

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు, మడూరు, అన్నవరం, పిచ్చపాడు, సోమాపురం, మొర్రాయిపల్లె గ్రామాలలో ఆదివారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌ సుబ్బరాయుడు, మండల కన్వీనర్‌ చంద్రశేఖర్‌ రెడ్డి ల ఆధ్వర్యంలో పండిట్‌ దీన్‌ దయాల్‌ వర్ధంతి వేడుకలు నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాలలోని ప్రజలతో మాట్లాడి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు



ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్‌ : స్థానిక పోలీసుస్టేషన్‌ ఆవరణలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో సోమవారం నుండి శ్రీదుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి వారి నూతన బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్ట, ఉత్సవ మూర్తుల సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ప్రదీప్‌కుమార్‌శర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటల నుండి 1 గంట వరకు గణపతిపూజ, రక్షాబంధనము, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, లలితాసహస్రనామ హోమం నిర్వహించి సాయంత్రం 5 గంటల నుండి అంకురార్పణ, జలాదివాసము వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మంగళవారం ఉదయం నుండి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీహోమము, వేద ఆశీర్వచనం నిర్వహించి సాయంత్రం 5 గంటల నుండి మహాస్నపనము, ధాన్యాదివాసము, పుష్పాదివాసము, శయ్యాదివాసము నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బుధవారం ఉదయం గర్తపూజ, యంత్రస్థాపన శాంతి పౌష్టిక హోమములు నిర్వహించి అనంతరం 10 గంటల నుండి దుర్గమల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించి సాయంత్రం నుండి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్‌ శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జల పూజ మహోత్సవం



గజ్జల పూజలో కోలాటం చేస్తున్న గ్రామస్తులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగర శివారులోని 45వ డివిజన్‌ ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా గజ్జల పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌ గోసుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కోలాటం గురువు సుధీర్‌ నేతృత్వంలో గ్రామంలోని ప్రజలు కోలాటం నేర్చుకొని చివరి రోజున గజ్జల పూజ కార్యక్రమాన్ని చేశారు.

ఘనంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



నగర సంకీర్తన చేస్తున్న ఆర్యవైశ్యులు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

కలసపాడు : స్థానిక అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకు గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. ఈ నగర సంకీర్తనలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉదయం 10–30 గంటల నుంచి గణపతిపూజ, నగరేశ్వరస్వామికి, వాసవిమాతకు అభిషేకాలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 7–30 గంటలకు ఆర్యవైశ్య మహిళలచే సామూహిక కుంకుమార్చన, పూజలు, భజనలు, గుడి ఉత్సవం, పవళింపుసేవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం వారిచే ఆర్యవైశ్యులందరికీ అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది నాగరాజా, మహిళా మండలి అధ్యక్షురాలు టి.సత్యవతమ్మ, సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు కామిశెట్టి జయకృష్ణ, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.